AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

చలికాలంలో గుండెజబ్బుల ముప్పు







అప్పయ్య ఆలయానికి వెండి బహూకరణ

## 105 ఏళ్ల వయస్సులో ఓటేసిన వృద్ధురాలు



**అక్షరటుడే, బీర్కూర్:** పండుటాకు అయినప్పటికీ.. ప్రజాస్వామ్యంపై.. ఓటు హక్కుపై ఆమెకు ఉన్న నిబద్ధత అందరికీ స్ఫూర్తినిస్తోంది. 105 ఏళ్ల వయస్సులోనూ ఉత్సాహంగా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేసిన వృద్ధురాలు నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తోంది. బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన 105 ఏళ్ల వృద్ధురాలు కొర్రి నాగమ్మ బుధవారం పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు హక్కు వినియోగించుకుంది. వయస్సు పైబడినప్పటికీ వీల్‌చైర్‌లో వచ్చి ఓటువేసింది.





## పోచారం శ్రీనివాస్ రెడ్డిని సన్మానించిన రైతులు

**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ మండలం చింతల నాగారం రైతులు బుధవారం ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డిని సన్మానించారు. లిఫ్ట్ ఇరిగేషన్ పైప్‌లైన్ పాడైపోవడంతో గత వర్షాకాలంలో పంటలకు నీరు అందని పరిస్థితి నెలకొనడంతో రైతులు పోచారం దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన పైప్‌లైన్ మరమ్మతులకు రూ. 6 లక్షలు, సిల్ట్ తొలగింపుకు రూ.1.50 లక్షలు నిధులు మంజూరు చేశారు. మంజూరైన నిధులతో చేపట్టిన పనులు పూర్తవ్వడంతో పాటు ట్రయల్ రన్ కూడా విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోచారంను బుధవారం సొసైటీ ఛైర్మన్ ఏర్వాల కృష్ణారెడ్డి, రైతులు సన్మానించారు.

## బాలిక మృతి.. బంధువుల ఆందోళన



**అక్షరటుడే, మెండోరా:** మెండోరా మండలం పోచంపాడ్ సాంఘిక సంక్షేమ పాఠశాల వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పాఠశాలలో చదువుతున్న ఓ విద్యార్థి అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో మృతురాలి బంధువులు ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే.. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సాయిలిఖిత ఇటీవల అస్వస్థతకు గురైంది. దీంతో విద్యార్థినిని నిర్మల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. అయితే విద్యార్థిని చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. దీంతో ఆమె బంధువులు బుధవారం పాఠశాలకు చేరుకున్నారు. విద్యార్థిని మృతదేహంతో ఆందోళనకు దిగారు. ఫుడ్ పాయిజన్‌తో పాటు డెంగ్యూ వల్ల విద్యార్థి చనిపోయిందని బంధువులు ఆరోపించారు. కాగా.. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని బంధువులను సముదాయించి అక్కడి నుంచి పంపించేశారు. ఈ క్రమంలో పాఠశాల వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

## అబార్షన్ చేసిన ఆస్పత్రిలో సీసీ ఫుటేజీ మాయం

**అక్షరటుడే, కామారెడ్డి :** అమ్మాయికి అబార్షన్ చేసిన ఘటనలో కామారెడ్డి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి తప్పించుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే ఈ కేసులో ఆస్పత్రి యాజమాన్యానికి షోకాజ్ నోటీసు ఇవ్వగా పొంతన లేని సమాధానాలు చెప్పారు. తమపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఉండేందుకు ఓ ఆస్పత్రి యాజమాన్యం ఏకంగా సీసీ ఫుటేజీ డిలీట్ చేసింది. జిల్లా వైద్యశాఖ నిర్లక్ష్యాన్ని వేలెత్తి చూపిన అబార్షన్ ఘటనపై ఇటు పోలీసులు, అటు వైద్యాధికారులు విచారణ చేపట్టగా ఆస్పత్రి యాజమాన్యం దొరక్కుండా ఉండేందుకు ప్రయత్నాలు చేస్తూనే ఉంది. తాడ్వాయి మండలం లోని ఓ గ్రామానికి చెందిన పెళ్లికాని అమ్మాయి గర్భం దాల్చగా ఆ యువతికి అబార్షన్ చేసిన ఘటనను 'అక్షరటుడే' వెలుగులోకి తీసుకువచ్చింది. విచారణలో భాగంగా ఆస్పత్రి, స్కానింగ్ సెంటర్లకు నోటీసులు జారీ చేశారు. అధికారుల నోటీసులకు ఆస్పత్రి నిర్వాహకులు పొంతనలేని సమాధానాలు ఇచ్చినట్టుగా తెలుస్తోంది. ఆస్పత్రికి విచారణకు వెళ్లిన అధికారులకు ఆస్పత్రి యాజమాన్యం సహకరించకపోగా ఆస్పత్రి రికార్డుల్లో కూడా ఈ ఘటనకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకుండా చేశారు. అబార్షన్ చేసిన రోజు సదరు అమ్మాయి ఆస్పత్రికి వచ్చిన సమయం నుంచి వెళ్లిపోయే వరకు సీసీ ఫుటేజీని, ఆస్పత్రి బయట ఉన్న దుకాణాల సీసీ ఫుటేజ్ కూడా డిలీట్ చేసినట్టుగా సమాచారం. దాంతో వైద్యాధికారులకు ఈ ఘటనలో ఎలాంటి ఆధారాలు లేక విచారణలో ముందుకు వెళ్లలేకపోతున్నట్టుగా తెలుస్తోంది. ఇక పోలీసు శాఖ తనదైన శైలిలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటుందా లేదా అనేది వేచి చూడాలి.



పంచాయతీ ఎన్నికల్లో భాగంగా చివరి విడత పోరు ముగిసింది. ఉమ్మడి జిల్లాలో బుధవారం పోలింగ్ ప్రశాంతంగా సాగింది. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు తలెత్తలేదు. ఇందుకోసం జిల్లా అధికారులు యంత్రాంగం పటిష్టమైన ఏర్పాట్లు చేసింది. మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ కొనసాగింది. క్యూలైన్లలో ఉన్నవారికి ఓట్లు వేసేందుకు అవకాశం కల్పించారు. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత కౌంటింగ్ ప్రారంభించారు. విజేతలను ప్రకటించిన అనంతరం ఉప సర్పంచ్‌లను ఎన్నుకునే ప్రక్రియనిర్వహించారు.

– ఇందూరు/భీమ్‌గల్/కామారెడ్డి/బాన్సువాడ

# తుది పోరు ప్రశాంతం..



■ ఓటెత్తిన గ్రామాలు ■ కామారెడ్డి జిల్లాలో రికార్డుస్థాయిలో 85.95 శాతం పోలింగ్
■ నిజామాబాద్‌లో 76.45 శాతం.. ■ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు

ఉమ్మడి జిల్లాలో మూడో విడత ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. నిజామాబాద్ జిల్లాలోని 12 మండలాల్లో 165 సర్పంచ్ స్థానాలు..1,620 వార్డు స్థానాలకు నోటిఫికేషన్ ఇవ్వగా..19 సర్పంచ్, 490 వార్డు స్థానాలకు ఏకగ్రీవమయ్యాయి. దీంతో బుధవారం 146 సర్పంచ్ స్థానాలకు 1,130 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, సీపీ సాయి చైతన్య, ఎన్నికల పరిశీలకులు శ్యాం ప్రసాద్ లాల్ ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. పలు కేంద్రాలను సందర్శించి అధికారులకు తగు సూచనలు చేశారు.

### అత్యల్పంగా ఆర్మూర్‌లో..

మూడో విడత ఎన్నికలు ఉదయం ఏడు గంటలకు ప్రారంభమై ఒంటిగంట వరకు కొనసాగింది. ఉదయం చలి నేపథ్యంలో ఓటింగ్ కాస్త మందకొడిగా సాగినా 8 గంటల తర్వాత కాస్త పుంజుకుంది. జిల్లాలో తొలి



రెండు గంటల్లో 23.35 శాతం ఓటింగ్ నమోదైంది. అలాగే ఉదయం 11 గంటల వర కు 54.69 శాతం, పోలింగ్ ముగిసే సమయానికి ఒంటి గంట వరకు 74.36 శాతం ఓట్లు పోలయ్యాయి. అయితే క్యూలైన్‌లో ఓటర్లు ఉండడంతో తుది పోలింగ్ శాతం మ రింత పెరిగింది. చివరకు 76.45 శాతంగా నమోదైంది. అత్యధికంగా నందిపేట మండలంలో 78.71 శాతం నమోదవ్వగా, అత్యల్పంగా ఆర్మూర్ మండలంలో 74.77 శాతం ఓట్లు పోలయ్యాయి. ఆర్మూర్ డివిజన్‌లో మొత్తం 3,06,795 మంది ఓటర్లు ఉండగా.. 2,34,546 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో మహిళలు 1,37,555 మంది, పురుషులు 96,990 మంది ఓట్లు వేశారు.

### కామారెడ్డి జిల్లాలో 85.95 శాతం..

కామారెడ్డి జిల్లాలో మూడో విడత ఎన్నికల్లో బాన్సువాడ డివిజన్ పరిధిలో 168 గ్రామ పంచాయతీలు, 1,482 వార్డుల్లో పోలింగ్ జరిగింది. 26 సర్పంచ్ స్థానాలు, 449 వార్డు స్థానాలు ఏకగ్రీవం కాగా 13 వార్డులకు ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదు. దాంతో బుధవారం 142 గ్రామ పంచాయతీలు, 1,020 వార్డు స్థానాల్లో మూడో విడత ఎన్నికలు జరిగాయి.

### బాన్సువాడ డివిజన్‌లో..

బాన్సువాడ డివిజన్ పరిధిలో 8 మండలాల్లో 1,90,296 మంది ఓటర్లు ఉండగా ఇందులో మహిళా ఓటర్లు 97,561, పురుష ఓటర్లు 92,728, ఇతరులు ఆరుగురు ఉన్నారు. పోలింగ్‌లో 1,63,567 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఇందులో 83,019 మహిళలు, 80,546 మంది పురుషులు, ఇద్దరు ఇతరులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. బుధవారం ఉదయం 9 గంటల వరకు 21.49 శాతం, 11 గంటల వరకు 56.71 శాతం, మధ్యాహ్నం ఒంటిగంట వరకు 80.62 శాతం పోలింగ్ నమోదైంది. చివరికి క్యూలైన్లలో నిలబడ్డ వారితో సహా ఓట్లు లెక్కింగా 85.95శాతంగా నమోదైంది.

మరిన్ని ఫొటోలు 2వ పేజీలో..

### మండలాల వారీగా ఓటింగ్ శాతం

| | | | |
|---|---|---|---|
| నిజామాబాద్ | | కమ్మర్‌పల్లి | 75.19 |
| నందిపేట | 78.71 | బాల్కొండ | 75.05 |
| డొంకేశ్వర్ | 78.06 | కామారెడ్డి | |
| ముప్కాల్ | 77.99 | బాన్సువాడ | 83.69 |
| మెండోరా | 76.29 | బిచ్కుంద | 87.25 |
| ఏర్గట్ల | 78.64 | బీర్కూర్ | 80.76 |
| ఆలూర్ | 76.09 | డొంగ్లీ | 88.75 |
| మోర్తాడ్ | 76.44 | జుక్కల్ | 87.59 |
| వేల్పూర్ | 75.84 | మద్నూర్ | 85.17 |
| ఆర్మూర్ | 74.77 | నస్రుల్లాబాద్ | 85.41 |
| భీమ్‌గల్ | 76.06 | పెద్దకొడప్‌గల్ | 89.69 |



బాల్కొండలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



నస్రుల్లాబాద్ మండలం దుర్కిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సంగ్వాన్



## గ్రామాల అభివృద్ధికి పాటుపడాలి

**అక్షరటుడే, ఇందూరు :** సర్పంచ్ ఎన్నికల్లో గెలుపొందిన బీజేపీ మద్దతుదారులు గ్రామ అభివృద్ధికి పాటుపడాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. సర్పంచ్‌గా గెలుపొందిన వారిని జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇదే స్ఫూర్తితో రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో జిల్లావ్యాప్తంగా విజయం సాధించేందుకు పనిచేయాలన్నారు. పార్టీ అధిష్టానం కార్యకర్త నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రుల వరకు ఒకే దృష్టితో చూస్తుందన్నారు. గెలుపొందిన సర్పంచులు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అవినీతిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. బీజేపీ అధిష్టానం గెలిచిన వారికి మద్దతుగా నిలుస్తూ ముందుండి నడిపిస్తుందన్నారు. కార్యక్రమంలో మల్లారం గ్రామ సర్పంచ్ గోపి, వార్డు సభ్యులు, మోస్రా సర్పంచ్ భూపాల్ రెడ్డి పాల్గొన్నారు.



మెండోరా సర్పంచ్‌గా కుంట లక్ష్మి రమేశ్



అంకోల్ క్యాంప్ సర్పంచ్‌గా అనిత రాములు



రాంపూర్ సర్పంచ్‌గా సూలం లావణ్య



సంగోజీపేట్ సర్పంచ్‌గా మంద సంగమేశ్వర్



హన్మాజీపేట్ సర్పంచ్‌గా లావణ్య వెంకా గౌడ్



పిప్రి సర్పంచ్‌గా అరిగేలా జనార్దన్

## బరిలో నిలిచి.. విజయం సాధించి..

పంచాయతీ ఎన్నికల్లో తుదివిడత ఎన్నికలు రసవత్తరంగా సాగాయి. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో పోలింగ్ శాతం భారీగా నమోదైంది. హోరాహోరీ పోరులో పలువురు అభ్యర్థులు విజయకేతనం ఎగురవేశారు. – అక్షరటుడే, నెట్‌వర్క్



నాగారం సర్పంచ్‌గా దౌల్తాపురం గీత



మొగులాన్‌పల్లి సర్పంచ్‌గా కాట్రోత్ పూజారి



జాగిర్యాల్ సర్పంచ్‌గా ప్రసాద్



ఆలూరు మండలం గగ్గుపల్లి సర్పంచ్‌గా గంగాధర్



రాచకొండ సర్పంచ్‌గా విష్ణువర్ధని శంకర్ గౌడ్



వన్నెల్ (కే) సర్పంచ్‌గా బండి చిన్నయ్య



అమ్దాపూర్ సర్పంచ్‌గా లింబాద్రి



## పల్లె ప్రజలను చూసి పట్టణవాసులు బుద్ధి తెచ్చుకోవాలి..

**అక్షరటుడే, ఆర్మూర్ :** పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి కుటుంబ సమేతంగా ఓటు వేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పల్లెలను చూసి.. పట్టణవాసులు సిగ్గుపడాలని ఆయన పేర్కొన్నారు. పల్లెల్లో వృద్ధులు సైతం క్యూలైన్లలో నిలబడి ఓట్లేస్తుంటే.. పట్టణాల్లో మాత్రం పోలింగ్ రోజు హాలీడే దొరికిందని సంబరపడిపోయి ఫామ్‌హౌస్‌లలో సంబరాలు చేసుకుంటారని మండిపడ్డారు. ఓటు విలువ తెలిసిన వృద్ధులు సైతం క్యూలైన్లలో నిలబడ్డారన్నారు. మహాత్ముల త్యాగాలతో వచ్చిన దేశ స్వాతంత్రాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఓటు హక్కు వినియోగంతోనే సుపారిపాలన సాధ్యమన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో ఓ వర్గానికి చెందిన పోలింగ్ బూత్‌లలో 92 శాతం ఓటింగ్ నమోదైతే.. మరోవర్గం బూత్‌లలో 20శాతం కూడా ఓటింగ్ కాలేదన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు వేయాలన్నారు. ఇక ఎన్నికల్లో ఓడిన నేతలు నిరాశ చెందవద్దన్నారు. ఇందిరాగాంధీ, ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు, వైఎస్సార్, కేసీఆర్, రేవంత్ రెడ్డి ఓడి గెలిచినవారేనని చెప్పారు.

అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND

2

నిజామాబాద్/కామారెడ్డి
బుధవారం
17.12.2025

www.aksharatoday.in
AKSHARA TODAY

## గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి




**అక్షరటుడే, భీమ్‌గల్ :** ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, అంకితభావంతో గ్రామ సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి నూతన ప్రజాప్రతినిధులకు సూచించారు. వేల్పూర్ మండలం జానకంపేట సర్పంచ్ కొలిపాక సంతోష్ రెడ్డి, వార్డు సభ్యులు సౌడ రాకేష్, ఎడ్ల ఓ పెష్, తలారి గంగాధర్, వేణు తదితరులు బుధవారం వేల్పూర్‌లో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏకగ్రీవంగా ఎన్నికవ్వడం అనేది బాధ్యతను మరింత పెంచుతుందని, పార్టీలకతీతంగా గ్రామాన్ని ప్రగతి పథంలో నడిపించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాగాధర్ రెడ్డి, సౌడ రమేష్, కొలిపాక శ్రీనివాస్, సత్యం, డైరెక్టర్ శేఖర్, శోభన్ గౌడ్ పాల్గొన్నారు.



## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన టీజీఎండీసీ చైర్మన్

**అక్షరటుడే, భీమ్‌గల్:** మెండోరా మండల కేంద్రానికి చెందిన ముస్కు సురేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఈ సందర్భంగా టీజీఎండీసీ ఛైర్మన్, బాల్కొండ మాజీ ఎమ్మెల్యే అనిల్ కుమార్ ఈరవత్రి బుధవారం సురేష్ నివాసానికి వెళ్లారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సురేష్ కుటుంబ సభ్యులతో మాట్లాడి వారిని ఓదార్చారు. ఆయన అకాలమరణం కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆయన వెంట స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు ఉన్నారు.

## ఓటు కోసం సౌదీ నుంచి స్వగ్రామానికి..



**అక్షరటుడే, భీమ్‌గల్ :** ఒక్క ఓటు గ్రామ తలరాతను మారుస్తుందని నమ్మాడు.. ఉపాధి కంటే బాధ్యతే మిన్న అని చాటాడు ఓ యువకుడు. సౌదీ అరేబియాలో ఉపాధి పొందుతున్న సంపత్ గౌడ్ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తన ఓటు హక్కును వినియోగించుకునేందుకు స్వదేశానికి వచ్చాడు. వివరాల్లోకి వెళ్తే.. నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ గ్రామానికి చెందిన సంపత్ గౌడ్ బొమ్మకంటి ఉపాధి నిమిత్తం సౌదీ అరేబియాలో ఉంటున్నాడు. ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో, తన గ్రామాభివృద్ధిలో భాగస్వామి కావాలని ఆయన నిర్ణయించుకున్నాడు. విమాన ప్రయాణ ఖర్చులు, సెలవు ఇబ్బందులను లెక్కచేయకుండా గ్రామానికి చేరుకున్నాడు. బుధవారం ఉత్సాహంగా తన ఓటు హక్కును వినియోగించుకున్నాడు. 'ఓటు అనేది ప్రజాస్వామ్యానికి ప్రాణం. మనం వేసే ప్రతి ఓటూ గ్రామ భవిష్యత్తును నిర్ణయిస్తుంది. ఉపాధి కోసం ఎక్కడ ఉన్నా.. మన మూలాలున్న గ్రామం కోసం ఓటు వేయడం ప్రతి పౌరుడి కనీస ధర్మం' అని సంపత్ గౌడ్ ఈ సందర్భంగా పేర్కొన్నాడు.



## సోమార్‌పేట్ ఘటనకు నిరసనగా 19న ఎల్లారెడ్డి బంద్

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** సోమార్‌పేట్ ఘటనకు నిరసనగా ఈనెల 19న ఎల్లారెడ్డి బంద్‌కు పిలుపునిస్తున్నట్లు విపక్ష నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం వారు పట్టణంలోని శివాజీ చౌరస్తాలో సోమార్‌పేట్ గ్రామస్థులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విపక్ష నాయకులు మాట్లాడుతూ.. సర్పంచ్ ఎన్నికల ఫలితాల అనంతరం సోమార్‌పేట్ గ్రామానికి చెందిన సర్పంచ్ కుర్మ పాపయ్య తమ్ముడు కురుమ చిరంజీవి అనే వ్యక్తి ఓటమిపాలైన బిట్ల బాలరాజు ఇంటిపై దాడికి పాల్పడ్డాడని ఆరోపించారు. ఈ సంఘటనకు బాధ్యులైన కుర్మ చిరంజీవిని అరెస్టు చేసి పోలీసులు రిమాండ్ చేశారన్నారు. అయితే తమ ఫిర్యాదులో పేర్కొన్న కురుమ సాయిబాబా, కురుమ పాపయ్యతో పాటు ఇతరులపై కేసులు నమోదు చేయకుండా పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వారు ఆరోపించారు. ట్రాక్టర్‌తో ఢీకొట్టి హత్యాయత్నానికి పాల్పడేలా ప్రేరేపించిన వ్యక్తులపై వెంటనే కేసులు నమోదుచేసి రిమాండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. 24 గంటల్లో పోలీసులు చర్యలు తీసుకోకపోతే ఈనెల 19న శుక్రవారం ఎల్లారెడ్డి పట్టణ బంద్‌కు పిలుపునిస్తున్నట్లు విపక్ష నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు జనార్దన్ రెడ్డి, ఆదిమూలం సతీష్, పెద్ద ఎడ్ల నర్సింలు, చిరంజీవులు, పృథ్వీరాజ్, బర్కత్, అంజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీపీ సాయిచైతన్య



ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి కుటుంబీకులు

# తుదిదశ పోరు ప్రశాంతం..




బీర్కూర్ జడ్పీ పాఠశాల పోలింగ్ కేంద్రంలో క్యూలో నిలబడిన ఓటర్లు



బాన్సువాడ మండలం కోనాపూర్‌లో ఓటు వేసిన ఓటర్లు



చౌట్‌పల్లి పోలింగ్ కేంద్రంలో ఓటు వేస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నపూర్ణమ్మ



మెండోరాలో పోలింగ్ సమయం ముగియడంతో కేంద్రానికి తాళం వేస్తున్న సిబ్బంది

## అయ్యప్ప ఆలయానికి కిలో వెండి బహూకరణ



**అక్షరటుడే, లింగంపేట:** మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయానికి బుధవారం లింగంపేట గౌడ సంఘం తరఫున కిలో వెండిని విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం ప్రతినిధులు మనోహర్ గౌడ్, వెంకట్ గౌడ్, రవి గౌడ్, సిద్ధా గౌడ్, సుదర్శన్ గౌడ్, శంకర్ గౌడ్, బుజ్జి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఓటుహక్కు సంప్రదాయం కావాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** ఓటుహక్కు ప్రతి ఒక్కరికి రాజ్యాంగం కల్పించిన హక్కు అని ప్రముఖ న్యాయవాది భూషణ్ రెడ్డి అన్నారు. ప్రతి పౌరుడు విధిగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. బాన్సువాడ మండలం తాడ్కోల్‌లో ఆయన సతీమణి హేమలతతో కలిసి సంప్రదాయ దుస్తులతో వెళ్లి బుధవారం ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటు వేయడం ప్రతి పౌరుని కనీస బాధ్యత అని, మెరుగైన సమాజం కోసం ఓటును వినియోగించుకొని ఉత్తమమైన నాయకులను ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు.

## గ్రామాల అభివృద్ధికి సర్పంచులు కృషి చేయాలి



**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** మండలంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని మున్సిపల్ మాజీ ఛైర్మన్ కుడుముల సత్యనారాయణ సూచించారు. మండలంలోని పలు గ్రామాల సర్పంచ్, ఉపసర్పంచ్ లను బుధవారం సన్మానించారు. రేపల్లెవాడ, సబ్దల్‌పూర్, మల్లయ్యపల్లి, మౌలాన్‌ఖేడ్, అల్మాజీపూర్, బ్రాహ్మణపల్లి, లక్ష్మాపూర్, హాజీపూర్, అడవిలింగాల్ సర్పంచ్‌లు దుద్దుల వనిత సాయిరాం, బయ్యని స్వప్న సాయిలు, ఎరువుల లక్ష్మీ మైసయ్య, పుట్ల చంద్రశేఖర్, దత్తు, అంజయ్య, నాయక్ సాయిలు, రతన్ నాయక్, మంగలి సంతోష్ తదితరులను సన్మానించారు.

## మానవత్వం చాటిన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



**అక్షరటుడే, బాన్సువాడ:** కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మానవత్వం చాటుకున్నారు. ఆయన వెళ్తున్న దారిలో ప్రమాదం జరగగా వెంటనే స్పందించి బాధితులకు సాయం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా బుధవారం మధ్యాహ్నం రెండుగంటల ప్రాంతంలో వివిధ మండలాల్లో కొనసాగుతున్న కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ వెళ్తున్నారు. ఈ క్రమంలో నిజాంసాగర్-మాగి మధ్య ఆటో, బైక్ ఢీకొనగా ఓ వ్యక్తి తీవ్ర గాయాలపాలై రోడ్డు పక్కన పడి ఉన్నాడు. అదేదారిలో వెళ్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ వెంటనే కారు ఆపి బాధితుల దగ్గరికి వెళ్లారు. పెద్దకొడప్‌గల్‌లో ఓటు వేసిన అనంతరం తిరిగివెళ్తుండగా బైక్‌ను ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడగా కలెక్టర్ స్పందించి సిబ్బంది ద్వారా ఇతర వాహనంలో ఎక్కించి ఆస్పత్రికి తరలించారు. కలెక్టర్ స్పందనపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## రెంజల్ జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలను ఎస్సీ, ఎస్టీలకు కేటాయించాలి



**అక్షరటుడే,బోధన్ :** రెంజల్ మండల జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాల రిజర్వేషన్లను ఎస్సీ,ఎస్టీలకు కేటాయించాలని ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ బోధన్ డివిజన్ కో కన్వీనర్ నీరడి రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు రెంజల్ ఎంపీడీవో కమలాకర్ కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెంజల్ మండలం ఏర్పడి నేటికీ సుమారు 40 ఏళ్లు కావస్తున్నప్పటికి ఇప్పటివరకు ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలను ఎస్సీ, ఎస్టీలకు కేటాయించలేదన్నారు. జనాభా దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీలు అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ వారికి రిజర్వేషన్లు కేటాయించకపోవడం అన్యాయమన్నారు.

## పారిశుధ్య పనులను పరిశీలించిన కమిషనర్



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో జరుగుతున్న పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ శ్రావణి పరిశీలించారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో తిరుగుతూ సిబ్బంది పనితీరును గమనించారు. ఆమె వెంట సానిటరీ సూపర్‌వైజర్ నరేందర్, పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి తదితరులు ఉన్నారు.

# చలికాలంలో గుండె జబ్బుల ముప్పు



**చలికాలం అనారోగ్య సమస్యలకు పుట్టినిల్లు లాంటిది. వైరస్, బ్యాక్టీరియల్ జబ్బులతో పాటు గుండెజబ్బుల ముప్పు ఎక్కువ అని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ కాలంలో సాధారణ రోజుల్లో ఎదురయ్యే గుండెపోటు తీవ్రత కంటే అధిమని చెబుతున్నారు. నవంబర్-ఫిబ్రవరి మధ్య గుండెపోటు ఘటనలు 15-20 శాతం అధికంగా నమోదయ్యే అవకాశం ఉందని అధ్యయనాలు పేర్కొంటున్నాయి. చలి కాలంలో గుండె సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిజామాబాద్ మెడికవర్ హాస్పిటల్ ప్రముఖ గుండె వైద్యనిపుణులు డాక్టర్ సందీప్ రావు 'అక్షరటుడే'కు వివరించారు.** – అక్షరటుడే, ఇందూరు

చలికాలంలో గుండె జబ్బుల బారిన పడే ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. ఇటీవల కాలంలో యుక్త వయసులో ఉన్న యువత ఎక్కువగా గుండె సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. ఆహారపు అలవాట్లు తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా గుండె సంబంధిత వ్యాధుల బారిన పడకుండా ఉండే ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. వాతావరణంలో ఒక్క సారిగా మార్పులు రావడం, చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో రక్త ప్రసరణలో మార్పుల కారణంగా గుండెపోటు బారిన పడే అవకాశం ఉంది. యుక్త వయసులో ఉన్న యువకులతో పాటు దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడినవారు గుండెపోటుకు గురికావొచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాలు చెబుతున్నాయి.

### ఈ లక్షణాలు కనిపిస్తే వైద్యుడిని సంప్రదించండి

చలికాలంలో బీపీ, రక్తనాళంలో కొవ్వు సమస్యలు తలెత్తుతాయి. చెమటలు రావడం, అలసట లాంటి లక్షణాలు కనబడితే నిర్లక్ష్యం వహించకూడదు. వైద్యుల్ని సంప్రదించి సలహాలు సూచనలు పాటించాలి. ఆకస్మిక గుండెపోట్లు ఒక్క శాతం మాత్రమే వస్తాయి. మిగతా సందర్భాల్లో రెండు మూడు నెలల ముందు నుంచి రకరకాల అనారోగ్య సమస్యలు కనిపిస్తాయి. అలసట, దమ్ము, చెమటలు రావడం, శరీరంలో వీక్నెస్, ఒబెసిటీ, ఒత్తిడి లక్షణాలు కనబడతాయి.

### వ్యాయామం అవసరం

ఒకప్పుడు ప్రజలు కష్టపడి పనిచేసేవారు. కానీ ప్రస్తుతం డెస్క్ జాబ్‌లు చేసే వారే అధికంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో శారీరక శ్రమ తగ్గిపోయింది. యోగా, వ్యాయామం, వాకింగ్ లాంటివి చేయకపోవడం ద్వారా రక్తనాళాల్లో సమస్యలు తలెత్తి గుండెపోటు బారినపడే అవకాశం ఉంటుంది. అలాగే జంక్ ఫుడ్, ఆల్కాహాల్, స్మోకింగ్ లాంటివి కూడా గుండె జబ్బులకు దారితీసే ఛాన్స్ అధికంగా ఉంటుంది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు సైతం గుండె సంబంధిత వ్యాధుల బారిన పడే ఆస్కారం ఎక్కువ అని వైద్యుడు తెలిపారు.

### ఈ జాగ్రత్తలు పాటించండి..

అనారోగ్యాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ సందీప్ రావు సూచించారు. నిత్యం వ్యాయామం చేయడంతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని తెలిపారు. వృద్ధులు, షుగర్, బీపీ, కొలెస్ట్రాల్, స్థూలకాయం వంటి సమస్యలు ఉన్నవారు చలికాలంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఉదయం వేళల్లో ఒక్కసారిగా చల్లని వాతావరణంలో బయటకు వెళ్లడం, తీవ్రమైన శారీరక శ్రమ చేయడం ప్రమాదకరమని చెప్పారు. అలాగే పొగ తాగడం, మద్యం సేవించడం వంటి అలవాట్లు గుండె ఆరోగ్యాన్ని మరింత దెబ్బతీస్తాయని హెచ్చరించారు. వెచ్చని దుస్తులు ధరించడం, గోరువెచ్చని నీటిని తాగడం, ఉప్పు, కొవ్వు పదార్థాలను తగ్గించి ఆకుకూరలు, పండ్లు, ఫైబర్ ఉన్న ఆహారం తీసుకోవాలని సూచించారు. రోజూ తేలికపాటి నడక, యోగా, శ్వాస వ్యాయామాలు చేయడం గుండెకు మేలు చేస్తుందన్నారు.